క్లుప్తంగా

వ్యాక్సినేషన్ తప్పనిసరి

కర్నూలు(హాస్పిటల్): ఏఎన్ఎంలు తమ పరిధిలోని గర్భిణులు, పిల్లలకు సమయాను సారంగా వ్యాక్సిన్లు వేయించాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ వై.ప్రవీణ్ కుమార్ ఆదేశించారు. బుధవారం ఆయన స్థానిక మాధవీనగర్‌లోని సచివాలయంలో జరుగుతున్న టీకాల కార్యక్రమాన్ని తనిఖీ చేశారు. వ్యాక్సినేషన్ రికార్డులు, వ్యాక్సిన్లు నిల్వ ఉంచే పరికరాలను పరిశీలించారు. ముఖ్యంగా రోటా, ఎంఆర్ వ్యాక్సిన్లు వంద శాతం పూర్తి చేయాలన్నారు. గర్భిణులు కాన్పునకు వెళ్లే ఆసుపత్రిని ముందుగానే గుర్తించి ఆ వివరాలను ఎంసీపీ కార్డు ఏఎన్ఎం యాప్, ఆర్‌సీహెచ్ పోర్టల్‌లో నమోదు చేయాలని, ప్రమాదకర సంకేతాలున్న ఉన్న వారిని కాన్పు తేదీకి మూడు రోజులు ముందుగానే ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించి సుఖప్రసవం అయ్యేలా చూడాలని ఆదేశించారు. అర్హులైన పిల్లలకు విటమిన్-ఏ, ఐరన్ సిరప్‌లను పంపిణీ చేశారు. డిస్ట్రిక్ట్ కమ్యూనిటీ మొబిలైజర్ ప్రసాద్, సిబ్బంది ఉన్నారు.

బదిలీ అధికారికి సన్మానం



పదోన్నతిపై బదిలీ అయిన విజయలక్ష్మిని సత్కరిస్తున్న ఉద్యాన యంత్రాంగం

కర్నూలు(అగ్రికల్చర్): సుదీర్ఘకాలం ఉద్యాన శాఖ అధికారిగా పనిచేసిన విజయలక్ష్మి రైతుల అభ్యున్నతే లక్ష్యంగా సేవలందించారని జిల్లా ఉద్యాన శాఖ అధికారి పి.రామాంజనేయులు అన్నారు. ఆమె అసిస్టెంటు డైరెక్టర్‌గా పదోన్నతి పొంది కర్నూలు నగర పాలక సంస్థకు బదిలీ అయిన సందర్భంగా ఉద్యాన అధికారులు, సిబ్బంది ఘనంగా సత్కరించారు. కలెక్టరేట్ వెనుక ఉన్న ఉద్యాన భవన్‌లో జరిగిన కార్యక్రమంలో విజయలక్ష్మిని జిల్లా ఉద్యాన అధికారి రామాంజనేయులు, అధికారులు అనూష, మదన్‌మోహన్‌గౌడు, శ్రీవాణి, దస్తగిరి, సిబ్బంది సన్మానించి జ్ఞాపిక అందజేశారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో 18 వాహనాలు సీజ్

కర్నూలు: కర్నూలు శివారు సుంకేసుల రోడ్డులోని సంజీవని హాస్పిటల్ వద్ద ట్రాఫిక్ డీఎస్పీ నాగభూషణం ఆధ్వర్యంలో బుధవారం రాత్రి డ్రంకెన్ డ్రైవ్ నిర్వహించారు. తెలంగాణ రాష్ట్రం అలంపూర్ దుకాణం వద్ద మద్యం సేవించి 44వ నంబర్ జాతీయ రహదారిలో వాహనాలు నడుపుతూ కర్నూలుకు వస్తున్న 12 మంది ద్విచక్ర వాహన దారులు, ఆరుగురు ఆటోడ్రైవర్లను అదుపులోకి తీసుకుని వాహనాలను సీజ్ చేశారు. గురువారం మందుబాబులను కోర్టులో హాజరుపర్చనున్నట్లు డీఎస్పీ వెల్లడించారు.

అక్టోబర్ 1న ఉపాధ్యాయుల సమ్మేళనం

కర్నూలు కల్చరల్: వికాసభారతి ఆధ్వర్యంలో అక్టోబర్ 1వ తేదీన ఉపాధ్యాయులు, అధ్యాపకుల సమ్మేళనం నిర్వహించనున్నట్లు కార్యక్రమ సమన్వయకర్త ఎస్.శివప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. కర్నూలు నగర శివారులోని జి.పుల్లారెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో మధ్యాహ్నం 2 గంటలకు సమ్మేళనం ప్రారంభం అవుతుందని పేర్కొన్నారు. ప్రధాన వక్తలుగా గరికపాటి గురజాడ, వికాస భారతి సమన్వయకర్త నాగేంద్రప్రసాద్ హాజరు కానున్నట్లు తెలిపారు. వివరాలకు 94415 42517 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

వాజ్‌పేయ్‌కి నివాళి

కర్నూలు కల్చరల్: బీజేపీ జిల్లా కార్యాలయంలో బుధవారం భారతరత్న అటల్ బిహారీ వాజ్‌పేయి వర్ధంతి నిర్వహించారు. బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కాళింగి నరసింహ వర్మ, కర్నూలు అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్ రంగస్వామి, రాష్ట్ర నాయకులు సుధాకర్, ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షులు శ్రీనివాసులు తదితరులు అటల్‌జీ చిత్రపటానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వాజ్‌పేయ్ దేశ ప్రధాన మంత్రిగా మాతృ దేశం కోసం తన జీవితాన్ని అంకితం చేసిన మహనీయుడని కొనియాడారు.

ఓటరు జాబితా సవరణకు సహకరించండి



మాట్లాడుతున్న ఆర్డీఓ హరిప్రసాద్

గూడూరు: ఓటరు జాబితా సవరణ కార్యక్రమానికి రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని కర్నూలు ఆర్డీఓ హరిప్రసాద్ కోరారు. ఆయన బుధవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ శివశంకర్‌నాయక్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఆర్డీఓ మాట్లాడుతూ.. తప్పులు లేని ఓటరు జాబితా తయారు చేసేందుకు బీఎల్‌ఓ లు ఇంటింటికీ తిరుగుతున్నారని, వారికి రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకారం అందించాలన్నారు. డబుల్ ఎంట్రీలు, మృతి చెందిన వారి పేర్ల తొలగింపుతో పాటు ఒక కుటుంబంలోని ఓటర్లందరూ ఒకే పోలింగ్ బూత్ పరిధిలో ఉండేలా చూడాలన్నారు. ఈ నెల 21 నాటికి ఓటరు వెరిఫికేషన్ సర్వే పూర్తి చేస్తామన్నారు. అలాగే జనవరి 1 నాటికి 18 ఏళ్లు నిండే వారందరికీ ఓటు హక్కు కల్పిస్తామని చెప్పారు.

మిషన్ ఇంద్రధనస్సు విజయవంతం

- జిల్లాలో 4,405 మందికి టీకాలు
- గతంలో వేయించుకోలేని వారికి అవకాశం
- సెప్టెంబర్, అక్టోబర్‌లో మరో విడత



చిన్నారికి టీకా వేస్తున్న వైద్యుడు

కర్నూలు(హాస్పిటల్): గతంలో ఏదో ఒక కారణం వల్ల వ్యాక్సినేషన్ వేయించుకోని పిల్లలకు మరోసారి వ్యాక్సిన్ వేయించుకునే అవకాశం కల్పించారు. ఈ మేరకు గత వారంలో మొదటి విడత కార్యక్రమాన్ని పూర్తి చేశారు. వచ్చే రెండు నెలల్లో మరో రెండు విడతల కార్యక్రమాల ద్వారా మరింత మంది చిన్నారులు, గర్భిణులకు టీకాలు వేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఈ మేరకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ చర్యలు చేపట్టింది.

జిల్లాలో 35 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, 26 అర్బన్ హెల్త్ సెంటర్లు, 5 కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, రెండు ఏరియా ఆసుపత్రులు, కర్నూలులో ఒక బోధనాసుపత్రి ఉన్నాయి. వీటితో పాటు వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లు, సచివాలయాలు, అంగన్‌వాడీ కేంద్రాలలో వైద్య సిబ్బంది ద్వారా గర్భిణులు, చిన్నారులకు టీకాలు వేస్తున్నారు. గతంలో వలసలు, ఊళ్లెళ్లడం, వివాహాది శుభకార్యాలు, కోవిడ్ పరిస్థితులు, ఇతర కారణాలతో రెండేళ్లలోపు చిన్నారులకు, గర్భిణులకు రొటీన్ ఇమ్యునైజేషన్ (టీకాలు) వేయించకపోతే ప్రస్తుత మిషన్ ఇంద్రధనస్సు కార్యక్రమంలో టీకాలు వేయించారు. ఈ మేరకు ఈ నెల 7వ తేదీ నుంచి 12వ తేదీ వరకు మొదటి విడత కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా జిల్లాలో 956 మంది గర్భిణులు, 2,775 మంది పిల్లలు, 1,174 మంది ఏడాదికి పైగా ఉన్న వారికి కలిపి వారం రోజుల్లో మొత్తం 4,405 మందికి టీకాలు వేశారు. మళ్లీ వచ్చే నెల(సెప్టెంబర్) 11 నుంచి 16వ తేదీ వరకు, అక్టోబర్‌లో 9 నుంచి 14వ తేదీ వరకు మిషన్ ఇంద్రధనస్సు కార్యక్రమం నిర్వహించనున్నారు.

ఆసుపత్రుల్లో రెగ్యులర్‌గా వేసే టీకాలు

- **శిశువు జన్మించినప్పుడు ఆసుపత్రిలో 24 గంటల్లోపు వేసేవి :** బీసీజీ, ఓపీవీ (జీరో డోస్), హెపటైటిస్-బి (బర్త్ డోస్)
- **ఆరు వారాలకు :** ఓపీవీ-1, పెంటావాలెంట్-1, ఐపీవీ-1, రోటావైరస్-1, పీసీవీ-1
- **10 వారాలకు :** ఓపీవీ-2, పెంటావాలెంట్-2, రోటావైరస్-2
- **14 వారాలకు :** ఓపీవీ-3, పెంటావాలెంట్-3, ఐపీవీ-2, రోటా-3, పీసీవీ-2
- **9 నెలలకు :** మీజిల్స్ రూబెల్లా-2, జేఈ-1, విటమిన్-ఎ, పీసీవీ బూస్టర్
- **16 నుంచి 24 నెలలకు :** డీపీటీ-1 బూస్టర్, ఓపీవీ బూస్టర్, మీజిల్స్ రూబెల్లా-2, జేఈ-2

చిన్నారులకు వీటిలో ఏవైనా వేయించకపోతే మిషన్ ఇంద్రధనస్సు కార్యక్రమంలో భాగంగా టీకా వేయించవచ్చు.

టీకాలతో చిన్నారులకు రక్ష

ఏదైనా కారణం చేత రెండేళ్లలోపు చిన్నారులకు గతంలో టీకాలు వేయించకపోతే మిషన్ ఇంద్రధనస్సు కార్యక్రమంలో టీకాలు వేయించవచ్చు. 5,200 మందికి టీకాలు వేయాలన్నది లక్ష్యం కాగా గత వారం నిర్వహించిన కార్యక్రమంలో 4 వేల మందికి పైగా గర్భిణులు, చిన్నారులకు టీకాలు వేశాం. గర్భిణులు, చిన్నారుల తల్లిదండ్రులు సమీపంలోని ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి ఫలానా రోజు, ఫలానా టీకా వేయించుకోలేదని చెబితే వెంటనే వారు టీకా వేస్తారు. టీకాలు వేయించుకోవడం వల్ల ప్రాణాపాయ వ్యాధుల నుంచి రక్షణ లభిస్తుంది. వీటి వల్ల ఎలాంటి దుష్పరిణామాలు ఉండవు.

– డాక్టర్ వై.ప్రవీణ్‌కుమార్, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి, కర్నూలు

మహిళకు రెండు గర్భాశయాలు

కర్నూలు(హాస్పిటల్): ఓ మహిళకు పుట్టుకతో రెండు గర్భాశయాలు ఏర్పడ్డాయి. అదనంగా ఏర్పడిన గర్భాశయంలో పిండం ఉండటం, గర్భాశయం చిన్నది కావడం, బిడ్డ పెద్దది కావడంతో గర్భవిచ్ఛిత్తి జరిగింది. ఆమెకు ప్రాణాపాయ పరిస్థితి ఏర్పడటంతో వైద్యులు అత్యవసరంగా ఆపరేషన్ చేసి పునర్జన్మ ప్రసాదించారు. వివరాలను బుధవారం కర్నూలులోని అమీలియో హాస్పిటల్‌లో ఎండీ డాక్టర్ లక్ష్మీప్రసాద్‌తో కలిసి గైనకాలజిస్టు డాక్టర్ కావ్య వివరించారు. 'చిప్పగిరి మండలం బెల్డోన గ్రామానికి చెందిన ఎం.చిన్న రంగమ్మ (23)కు పుట్టుకతోనే రెండు గర్భాశయాలు ఏర్పడ్డాయి. ఈ విషయం ఆమెకు తెలియదు. మొదటి ప్రసవం సైతం ఈ విషయం తెలియకుండానే జరిగిపోయింది. ఈ క్రమంలో ఆమె మళ్లీ గర్భం దాల్చింది. మూడో నెలలోనూ వైద్యులు గుర్తించలేకపోయారు. ఈ క్రమంలో ఈ నెల 10వ తేదీన ఆమెకు తీవ్రంగా కడుపునొప్పి రావడంతో ఆసుపత్రికి తీసుకొచ్చారు. తెల్లవారు జామున వైద్య పరీక్షలు నిర్వహించగా రెండు గర్భాశయాలు ఉన్నట్లు తేలింది. అదనంగా ఉన్న గర్భాశయం చిన్నదిగా ఉండటం, అందులోనే పిండం పెరగడంతో గర్భవిచ్ఛిత్తి జరిగింది. ఈ కారణంగా కడుపులోనే తీవ్ర రక్తస్రావం జరిగి హెచ్‌బీ 3 గ్రాములకు చేరింది. వెంటనే ఆమెకు అత్యవసర ఆపరేషన్ చేసి అదనంగా ఏర్పడిన గర్భాశయాన్ని తీసివేసి సమస్యను పరిష్కరించాం' అని వివరించారు. అనెస్తెటిస్ట్ డాక్టర్ శిల్ప పాల్గొన్నారు.

గడప గడపకు మన ప్రభుత్వం @ 200



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి, పక్కన మేయర్ బీవై రామయ్య

కల్లూరు: ప్రజా సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించేలా ప్రభుత్వం గడప గడపకు మన ప్రభుత్వం (జీజీఎంపీ) కార్యక్రమం ప్రవేశపెట్టిందని వైఎస్సార్‌సీపీ నంద్యాల, కర్నూలు జిల్లాల అధ్యక్షులు ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి, మేయర్ బీవై రామయ్య అన్నారు. కార్యక్రమంలో భాగంగా నియోజకవర్గంలోని ఏ గ్రామంలోకి వెళ్లినా సంక్షేమ పథకాలు పొందిన లబ్ధిదారులు, మహిళలు, ప్రజలు అపూర్వ స్వాగతం పలుకుతున్నారని ఎమ్మెల్యే కాటసాని అన్నారు. బుధవారం కల్లూరు అర్బన్ 19వ వార్డులో ఎమ్మెల్యే కాటసాని చేపట్టిన కార్యక్రమంతో జీజీఎంపీ 200 రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా సమావేశం ఏర్పాటు చేసి భారీ కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ఎమ్మెల్యే సతీమణి ఉమామహేశ్వరమ్మ, తనయుడు శివనరసింహారెడ్డి హాజరు కాగా వారిని వైఎస్సార్‌సీపీ నాయకులు భారీ గజమాలతో సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కార్యకర్తలకు ఎల్లప్పుడూ అండగా ఉంటానన్నారు. అర్బన్ ప్రాంతం రోజురోజుకు విస్తరిస్తుండటంతో ప్రాధన్యతలను అనుసరించి మౌలిక వసతులు కల్పిస్తున్నామన్నారు. మేయర్ రామయ్య మాట్లాడుతూ ఎమ్మెల్యే సహకారంతో కర్నూలు నగరంతో పాటు కల్లూరు అర్బన్ వార్డులను అభివృద్ధిలోకి తీసుకువస్తామన్నారు.డిప్యూటీ మేయర్ రేణుక, వీరశైవ లింగాయత్ కార్పొరేషన్ డైరెక్టర్ గోపాల్‌రెడ్డి, నాయకులు మహేశ్వర్‌రెడ్డి, మీదివేముల ప్రభాకర్‌రెడ్డి, కార్పొరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమానికి పెద్దపీట: రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నారని వైఎస్సార్‌సీపీ జిల్లాల అధ్యక్షులు, ఎమ్మెల్యే కాటసాని, మేయర్ రామయ్య అన్నారు. బుధవారం కల్లూరు అర్బన్ 19వ వార్డు రెవెన్యూ కాలనీలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే, మేయర్ కాలనీలో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరిస్తూ సంక్షేమ పథకాల బుక్‌లెట్లను పంపిణీ చేశారు. మున్సిపల్ అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

భూసేకరణ వేగవంతం చేయండి



మాట్లాడుతున్న రోడ్లు, భవనాల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ పీఎస్ ప్రద్యుమ్న, పక్కన జేసీ నారపురెడ్డి మౌర్య

కర్నూలు(సెంట్రల్): రాష్ట్రంలో జాతీయ రహదారుల విస్తరణకు భూసేకరణ వేగవంతం చేయాలని రాష్ట్ర రవాణా రోడ్లు, భవనాల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ పీఎస్ ప్రద్యుమ్న ఆదేశించారు. బుధవారం ఆయన కర్నూలు కలెక్టరేట్ నుంచి అన్ని జిల్లాల జాయింట్ కలెక్టర్లు, ఇతర అధికారులతో జాతీయ రహదారుల భూసేకరణపై సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ.. భూసేకరణలో వస్తున్న సమస్యలు, పరిహారం తదితర వివరాలను తమకు నివేదిస్తే పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. అటవీ, వక్ఫ్ భూముల సేకరణకు అనుమతుల కోసం సంబంధిత శాఖలకు నివేదిక పంపాలన్నారు. అనంతరం జిల్లాలో భూసేకరణ చేస్తున్న సోమయాజుల పల్లె-డోన్, ఆత్మకూరు-సంగమేశ్వరం రోడ్ల వివరాలను అడిగి తెలుసుకున్నారు. నన్నూరు ఫుట్ ఓవర్ బ్రిడ్జి, హుసేనాపురం సమీపంలోని అండర్ పాసేజ్ బ్రిడ్జిలను త్వరగా ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి కోరినట్లు ఆయన వివరించారు. జేసీ నారపురెడ్డి మౌర్య, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, నేషనల్ హైవే అధికారులు పాల్గొన్నారు.

సీమ యోధుల విగ్రహాలు ఏర్పాటు చేయాలి

కర్నూలు సిటీ: నగరంలోని బిర్లా కాంపౌండ్ వద్ద కొత్తగా నిర్మిస్తున్న సర్కిల్‌లో రాయలసీమ స్వాతంత్ర్య సమరయోధులు ముత్తూకురు గౌడప్ప, రసూల్‌ఖాన్ విగ్రహాలు ఏర్పాటు చేయాలని రాయలసీమ విద్యార్థి పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు రవికుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆ సంఘం తరపున బిర్లా కాంపౌండ్ వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాయలసీమ నుంచి మొట్టమొదటగా 1801లోనే తెర్నేకల్లు గ్రామంలో ముత్తూకురు గౌడప్ప ఆధ్వర్యంలో బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా అనేక ఉద్యమాలు నడిపారని వివరించారు. 15 రోజుల పాటు నడిపిన ఉద్యమం వల్ల ఆయన్ను గ్రామంలోని ఊరువాకిలికి ఉరి తీశారన్నారు. ఈ ఉద్యమంలో పాల్గొన్న వందలాది మందిని అంతమొందించి గ్రామంలోని కుక్కల బావిలో మృతదేహాలను వేశారని చరిత్ర చెబుతుందన్నారు. అదే విధంగా కర్నూలు వేదికగా ఆఖరు నవాబు రసూల్‌ఖాన్ 1839లోనే బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా పోరాటం చేసి బందీ అయ్యి విషప్రయోగం వల్ల మరణించిన వీరుడని చెప్పారు. వారి పోరాటాలను మరిచిపోరాదని, కావున కొత్తగా నిర్మించే సర్కిల్‌లో యోధుల విగ్రహాలు ఏర్పాటు చేయాలన్నారు. రాయలసీమ విద్యార్థి పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు అశోక్, తదితరులు ఉన్నారు.

పండ్ల తోటల అభివృద్ధికి కృషి



డ్వామా పీడీ అమరనాథ్ రెడ్డి

కర్నూలు(అగ్రికల్చర్): పండ్ల తోటల అభివృద్ధిపై ఉపాధి సిబ్బంది దృష్టి సారించాలని డ్వామా పీడీ అమర్‌నాథ్ రెడ్డి సూచించారు. గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ సూర్యకుమారి త్వరలో జిల్లాలో పర్యటించనున్నారని పండ్ల తోటల అభివృద్ధి, అవెన్యూ ప్లాంటేషన్ ముమ్మరం చేయాలని ఆదేశించారు. బుధవారం తన చాంబరు నుంచి జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా వివిధ అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ.. గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ జిల్లాలో పర్యటించడంతో పాటు ఉమ్మడి కర్నూలు యూనిట్‌గా ఉపాధి కార్యక్రమాలపై సమీక్ష నిర్వహిస్తారని, ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రతి పంచాయతీలో ఉపాధి కార్యక్రమాలకు సంబంధించి 7 రకాల రికార్డులను పకడ్బందీగా అప్‌లోడ్ చేయాలని సూచించారు. ప్రతి పని ప్రదేశంలో వర్క్ సైట్ బోర్డు పెట్టాలన్నారు. హార్టికల్చర్ ప్లాంటేషన్ కార్యక్రమాలను ముమ్మరం చేయాలన్నారు. అదనపు పీడీ సలీంబాష పాల్గొన్నారు.

పిల్లలకు టీకాలు వేయించాలి

కర్నూలు (న్యూటౌన్): గర్భిణులు, చిన్న పిల్లలకు వ్యాధి నిరోధక టీకాలు క్రమం తప్పకుండా వేయించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ బి.రామగిడ్డయ్య సిబ్బందిని ఆదేశించారు. బుధవారం కర్నూలు మండలం పసుపుల గ్రామంలో జరుగుతున్న వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. వ్యాధి నిరోధక టీకాలు సక్రమంగా అందిస్తున్నారా లేదా అని ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించాలని సూచించారు. అన్ని యాప్‌లలో ప్రోగ్రామ్స్ అప్‌లోడ్ చేయాలన్నారు. గార్గేయపురం పీహెచ్‌సీ వైద్య సిబ్బంది, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

18న జాబ్‌మేళా

కర్నూలు(సెంట్రల్): ఎస్‌బీఐ లైఫ్ ఇన్సూరెన్స్‌లో డెవలప్‌మెంట్ మేనేజర్ ఉద్యోగాల భర్తీ కోసం 18వ తేదీన జిల్లా ఎంప్లాయ్‌మెంట్ కార్యాలయంలో జాబ్ మేళా ని ర్వహించనున్నట్లు జిల్లా ఎంప్లాయ్‌మెంట్ ఆఫీసర్ పి.దీప్తి బుధవారం ఓ ప్ర కటనలో తెలిపారు. డిగ్రీ లేదా ఎంబీఏ చదివి లైఫ్ ఇన్సూరెన్స్ విభాగంలో అనుభవం ఉన్న యువతీ, యువకులు హాజరుకావొచ్చన్నారు. ఉద్యోగానికి ఎంపికైే వారికి రూ.2.35 నుంచి రూ.4.75 లక్షల వార్షిక వేతనం ఉంటుందని చెప్పారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి

కర్నూలు(రూరల్): తుగ్గలి మండలం ఎద్దుల దొడ్డి గ్రామానికి చెందిన దళిత మహిళపై అత్యాచారానికి పాల్పడిన నిందితులను అరెస్ట్ చేయాలని ఐద్వా సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు అరుణ, అలివేలు డిమాండ్ చేశారు. దళిత మహిళపై అత్యాచారం చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని కోరుతూ బుధవారం ఐద్వా సంఘం ఆధ్వర్యంలో నగరంలోని సుందరయ్య జంక్షన్‌లో ధర్నా నిర్వహించారు. కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి అనంద్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

పనిభారం తగ్గించాలి

కర్నూలు(రూరల్): మెప్మాలో పనిచేస్తున్న ఆర్పీలకు పనిభారం తగ్గించాలని మెప్మా ఆర్పీల సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శి ప్రభావతి, ఉమాదేవి డిమాండ్ చేశారు. బుధవారం నగరంలోని సుందరయ్య భవనంలో మెప్మా ఆర్పీల నగర కమిటీ అధ్యక్షురాలు రుద్రమ్మ అధ్యక్షతన జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో వారు మాట్లాడుతూ.. మెప్మాలో పనిచేస్తున్న ఆర్పీలతో టిడ్కో, పీఎం స్వానిధి, జగనన్న తోడు కార్యక్రమాలకు సంబంధించిన అదనపు పనులు చేయిండంతో మానసికంగా ఒత్తిడికి లోనవుతున్నారన్నారు. ఆర్పీలకు ఉద్యోగ భద్రత కల్పించి కనీస వేతన చట్టం అమలు చేయాలన్నారు. విధి నిర్వహణలో వేరే ప్రాంతాలకు వెళ్లినపుడు టీఏ, డీఏ ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకురాలు శ్యామల, విజయలక్ష్మి, సుజాత, సునీత, కళ్యాణి తదితరులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ పరీక్షలకు ఏర్పాట్లు

కర్నూలు(సెంట్రల్): పబ్లిక్ హెల్త్ శాఖలో శ్యాంపుల్ టేకర్, మునిసిపాలిటీల్లో టౌన్ ప్లానింగ్ అండ్ బిల్డింగ్ ఓవర్సీస్, వివిధ శాఖల అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీరింగ్ పోస్టుల భర్తీ కోసం పరీక్షలు నిర్వహించేందుకు ఏపీపీఎస్సీ ఇటీవల షెడ్యూల్ విడుదల చేసింది. ఈ నెల 18, 22వ తేదీల్లో ఆన్‌లైన్ ద్వారా కంప్యూటర్ బేస్డ్ పరీక్షలను నిర్వహించేందుకు చర్యలు చేపట్టింది. జిల్లాలోని అయాన్ డిజిటల్ సెంటర్‌లో ఉదయం, మధ్యాహ్నం పరీక్షలు జరుగుతాయి. పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా సమన్వయాధికారి, డీఆర్వో ఎస్వీనాగేశ్వరరావు తెలిపారు.

పనుల్లో నాణ్యత పాటించాలి

కర్నూలు(రాజ్‌విహార్): విద్యుత్ అభివృద్ధి పనుల్లో నాణ్యత తప్పనిసరిగా పాటించాలని దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ కర్నూలు ఆపరేషన్స్ ఎస్ఈ ఎం.ఉమాపతి అన్నారు. బుధవారం స్థానిక విద్యుత్ భవన్ నుంచి ఆయన కింద స్థాయి అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యుత్ సబ్‌స్టేషన్లతో పాటు ఇతర అభివృద్ధి పనులను నాణ్యతతో పూర్తి చేయాలని సూచించారు. నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రతి ఏఈ, ఏడీఈలు తమ పరిధిలో జరిగే పనులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు.

మహారాజశ్రీ కర్నూలు ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో
I.P. No. 30/2023
ఇంతియాజ్ బేగ్ ..అర్జీదారు
(ఎదురి)
జి.అనిల్ వగైరా ..రెస్పాండెంట్లు
జనరల్ నోటీసు
కర్నూలు జిల్లా, కర్నూలు గ్రామ ప్రజలకు తెలియజేయడమేమనగా పై నంబరు I.P. లో అర్జీదారు అయిన ఇంతియాజ్ బేగ్ తండ్రి అన్వర్ బేగ్, వ్యాపారం, పాతబస్తీ, కర్నూలు అను నతడు తనను దివాళాదారుగా తీర్మానించమని కోరుతూ పై కోర్టులో దివాళా అర్జీ దాఖలు చేసినాడు. ఇందులో ఎవరికైనా ఆక్షేపణ ఉన్నా 22-09-2023వ తేదీ పగలు 10.30 గంటలకు పై కోర్టులో హాజరై తెలుపుకొనవలెను. లేని యెడల పరోక్షమున విచారించి తీర్మానింపబడును.
కోర్టు వారి ఉత్తర్వు మేరకు
సి.గజేంద్ర గౌడ్, అర్జీదారుపరం అడ్వకేటు, కర్నూలు. సెల్: 99890 92262

25న బీపీ మండల్ జయంత్యుత్సవాలు



కరపత్రాలను విడుదల చేస్తున్న బీసీ జేఏసీ నేతలు

కర్నూలు(అర్బన్): బీసీ రిజర్వేషన్ల పితామహుడు బీపీ మండల్ జయంతి ఉత్సవాలను ఈ నెల 25వ తేదీన ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ బీసీ విభాగం రాష్ట్ర కార్యదర్శి, బీసీ జేఏసీ కన్వీనర్ దేవపూజ ధనుంజయ ఆచారి చెప్పారు. ఈ మేరకు బుధవారం స్థానిక బీసీ జేఏసీ కార్యాలయంలో కరపత్రాలను విడుదల చేశారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎం.సుభాష్ చంద్రబోస్, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ బెల్లం మహేశ్వరరెడ్డి, బీసీ సంక్షేమ సంఘం జాతీయ కార్యదర్శి నక్కలమిట్ట శ్రీనివాసులు, బత్తుల లక్ష్మికాంతయ్య హాజరయ్యారు. వారు మాట్లాడుతూ స్థానిక బీసీ భవన్‌లో ఉదయం 10 గంటలకు నిర్వహించనున్న ఈ కార్యక్రమానికి జిల్లాలోని బీసీ ప్రజా ప్రతినిధులు, బీసీ సంఘాల నేతలు, కుల సంఘాల నాయకులు, ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని కోరారు. సీనియర్ న్యాయవాది కేపీ అభిరాం, చంద్రికమ్మ, చంద్రకళాబాయి తదితరులు పాల్గొన్నారు.

శ్రావణం.. ఆధ్యాత్మిక వైభవం

- నేటి నుంచి శ్రావణ మాసం ప్రారంభం
- ఉరుకుంద క్షేత్రంలో నెల రోజుల పాటు ఉత్సవాలు
- శ్రీశైలంలో విశేషార్చనలు

కర్నూలు కల్చరల్: శ్రావణం.. ఆధ్యాత్మిక మాసం. శుభదాయకమైంది. భగవన్నామ స్మరణతో తెలుగు లోగిళ్లు మార్మోగుతాయి. ఈ మసంలో ప్రతి రోజు అత్యంత ప్రవిత్రమైనది కావడంతో భక్తులు కఠోర నియమ నిష్టలు పాటిస్తారు. గురువారం నుంచి ప్రారంభమయ్యే ఈ మాసంలోనే అత్యధిక పండుగలను జరుపుకుంటాం. నాగుల చవితి, వరలక్ష్మీ వ్రతం, రాఖీపౌర్ణమి, మంగళగౌరీ వ్రతం, శ్రీకృష్ణ జన్మాష్టమి, పొలాల అమావాస్య తదితర పండుగలు వస్తాయి. హిందువులకు అత్యంత ముఖ్యమైన ఈ పండుగలు బంధాలు, బాంధవ్యాలను తెలుపుతాయి.

శ్రీశైలంలో ఉత్సవాలు

శ్రావణ మాసంలో శ్రీశైల క్షేత్రంలో నెలంతా విశేష పూజాధికాలు, ప్రత్యేక ఉత్సవాలు నిర్వహించనున్నారు. శ్రావణ సోమవారాలు, శుక్రవారాలు, శనివారాలు, ఏకాదశులు, శ్రావణ పౌర్ణమి, మాసశివరాత్రి, తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నారు. భక్తుల సౌకర్యార్థం రెండవ, నాల్గవ శుక్రవారాల్లో ఉచితంగా వరలక్ష్మి వ్రతాలను నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.


ఉరుకుంద ఈరన్న స్వామి దేవస్థానంలో..

ఉరుకుంద నరసింహ ఈరన్న స్వామి దేవస్థానంలో ఈ నెల 17 నుంచి సెప్టెంబర్ 14వ తేదీ వరకు శ్రావణ మాసోత్సవాలు జరగనున్నాయి. సోమ, గురువారం రోజుల్లో స్వామివారికి విశేష పూజలు నిర్వహిస్తారు. ఐదో సోమవారం స్వామివారికి పల్లకి ఉత్సవం అత్యంత వైభవంగా నిర్వహిస్తారు. లక్షలాది మంది స్వామివారిని దర్శించుకోనుండటంతో ఆలయ అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. స్వామి ఆశ్రమం పొందిన గ్రామంతో పాటు, పరిసర గ్రామాలు, ఈ స్వామిని సేవించే వారు, ఉత్సవాలు ముగిసే వరకు మద్యపానానికి, మాంసాహారానికి దూరంగా ఉంటారు.

కర్నూలు నగరంలో..

కర్నూలు ఓల్డ్ సిటీలోని చిన్న అమ్మవారి శాల, పెద్ద అమ్మవారి శాల, లలితా పీఠం, నిమిషాంబదేవి ఆలయం, కాళికాంబ ఆలయం, వీఆర్ కాలనీ, కృష్ణానగర్, సంకల్ బాగ్‌లోని వేంకటేశ్వర స్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. స్థానిక సూర్యనారాయణ స్వామి ఆలయ ఆవరణలోని మహాగౌరి ఆలయం, సప్తగిరి మణికంఠ అయ్యప్ప స్వామి ఆలయంలోని చౌడేశ్వరీ దేవి ఆలయంలో శ్రావణ మాసంలో ప్రతి రోజూ విశేష పూజలు చేస్తారు.

శ్రావణ మాసం పవిత్రమైనది



సనాతన ధర్మంలో చంద్ర మానం ప్రకారం మనకున్న పన్నెండు మాసాల్లో ఐదవది శ్రావణ మాసం. ఇది అందరికీ అత్యంత ప్రీతి పాత్రమైంది. ఈ నెలలో పౌర్ణమి నాడు చంద్రుడు శ్రావణ నక్షత్రంలో సంచరించడంతో ఈ మాసానికి శ్రావణం అని పేరు వచ్చింది. ఈ మాసంలో ముఖ్యమైన పండుగలను జరుపుకుంటాం. ముఖ్యంగా అన్నాచెల్లెళ్ల బంధాన్ని బలోపేతం చేసే రాఖీ పౌర్ణమి చేసుకుంటాం. అత్తలు తమ కొత్త కోడళ్ల ఇంటికెళ్లి కొబ్బరి బెల్లం, నువ్వులు, ప్యాలపిండి ఇచ్చి యోగక్షేమాలు తెలుసుకుంటారు. ఈ మాసంలో వర్షాలు బాగా పడి రైతులు పంటలు వేసుకోడానికి ఉపయోగంగా ఉంటుంది.

– పి.చంద్రశేఖర శర్మ, పండితుడు

నిజాయితీకి మారుపేరు కోట్ల



నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

కర్నూలు(రూరల్): రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి కోట్ల విజయభాస్కర రెడ్డి నీతి నిజాయితీకి మారుపేరని డీసీసీ అధ్యక్షుడు సుధాకర్ బాబు పేర్కొన్నారు. బుధవారం కోట్ల జయంతి సందర్భంగా కళా వెంకట్రావ్ భవనంలో ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళుర్పించారు. అనంతరం కిసాన్ ఘాట్‌కు వెళ్లి కోట్ల విగ్రహానికి పూల మాలలు వేశారు. కార్యక్రమంలో నగర కాంగ్రెస్ అధ్యక్షుడు జాన్ విల్సన్, ఐఎన్‌టీయూసీ నాయకుడు బతుకన్న, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు బజారన్న, నగర మహిళా అధ్యక్షురాలు ప్రమీల సత్యరాజు తదితరులు పాల్గొన్నారు.

కర్నూలు(అర్బన్): ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి కోట్ల విజయ భాస్కర్ రెడ్డి స్ఫూర్తితో రాజకీయ నాయకులు ప్రజలకు సేవలందించాలని ఆంధ్రప్రదేశ్ రెడ్డి సంక్షేమ సంఘం నేతలు కోరారు. బుధవారం కోట్ల జయంతి సందర్భంగా స్థానిక కిసాన్‌ఘాట్‌లోని ఆయన విగ్రహానికి, సమాధికి నేతలు పూలమాలలు వేసి ఘనంగా నివాళి అర్పించారు. సంఘం రాష్ట్ర సంఘటనా కార్యదర్శి తూముకుంట ప్రతాపరెడ్డి, మహిళా విభాగం ప్రధాన కార్యదర్శి హేమలతారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.